

క్యాలెండర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం అర్బన్‌: బలుసులమ్మవారి చిత్రంతో ప్రచురించిన విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్య నారాయణ బుధవారం ఆవిష్కరించారు.



వైభవంగా కలశాభిషేకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక జనార్ధన స్వామి దేవస్థానంలో తిరుప్పావై నిర్వహించారు. ఆండాళ్‌, తాయార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు.

పంచామృతాభిషేకం



నరసాపురం రూరల్‌: మండలంలోని వేములదీవిలో స్వామివారికి బుధవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి హామీలో రికార్డు

- రాష్ట్ర స్థాయిలో ఏలూరు జిల్లాకు 4వ స్థానం
- ఏడాది లక్ష్యం తొమ్మిది నెలల్లోనే పూర్తి
- తొమ్మిది నెలల్లో 1.17 కోట్ల పనిదినాల కల్పన
- వేతనాలుగా రూ.240 కోట్లు అందజేత



ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళా కూలీలు (ఫైల్‌)

ఏలూరు (టూటౌన్‌): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఏలూరు జిల్లా సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. ఏడాది లక్ష్యాన్ని కేవలం 9 నెలల్లోనే పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1.17 కోట్ల పనిదినాలు లక్ష్యం కాగా.. ఇంతవరకూ కోటి 17 లక్షల 45 వేల మందికి పనులు కల్పించి రూ.240 కోట్లు వేతనాలుగా అందించారు. రాబోయే మూడు నెలల్లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మరో 25 లక్షల పనిదినాలు కల్పించి, వేతనాలుగా రూ.60 కోట్లు అందించే దిశగా డ్వామా అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లా పునర్విభజన తర్వాత ఒక్క ఏలూరు జిల్లాలోనే కోటికి పైగా పనిదినాలు కల్పించడంతో పాటు, అత్యధిక నిధులు ఖర్చు చేయడం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బంది, అధికారులు విశేష కృషి జరిపారు. కలెక్టర్‌ వి.ప్రసన్న వెంకటేష్‌ ఆదేశాల మేరకు జేసీ అరుణ్‌బాబు సమన్వయంతో మరింత మంది ఉపాధి కూలీలకు పనులు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు డ్వామా పీడీ డి.రాంబాబు చెప్పారు.

వేతనదారుల్లో 57 శాతం మంది మహిళలే

ఏలూరు జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో లక్ష్యానికి మించి పనులు కల్పించారు. పథకం ప్రారంభించిన తర్వాత ఈ తొమ్మిది నెలల్లో అత్యధికంగా కూలీలకు వేతనాలుగా చెల్లించడం విశేషం. వేతనాలు అందుకున్న వారిలో 57 శాతం మంది మహిళలే. ఏలూరు జిల్లా పరిధిలో 28 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 581 పంచాయతీలు ఉండగా.. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ 3.20 లక్షల జాబ్‌ కార్డుల దారులు మొత్తం 4.39 లక్షల మందికి ఉపాధి కల్పించారు.

వేతనాలుగా రూ.240.06 కోట్లు

జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకూ రూ.240.06 కోట్లు వేతనాలుగా చెల్లించారు. దీనికి అదనంగా మెటీరియల్‌ కాంపొనెంట్‌ కింద వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాలకు రూ.88 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి హామీలో వేతనాల కింద ఇచ్చిన మొత్తంలో 57 శాతం మహిళలకు రూ.136.73 కోట్లు అందజేశారు. వీరితో పాటు ఎస్సీలు 36.64 శాతం, ఎస్టీలు 9.14 శాతం మందికి ఉపాధి హామీ పనులు కల్పించారు.

ఏలూరు జిల్లాలో ఉపాధి కూలీలు పొందిన వేతనాలు

జిల్లాలో మొత్తం మండలాలు	28
గ్రామ పంచాయతీలు	581
జాబ్‌ కార్డుదారులు	3.20 లక్షలు

వేతనాలు పొందిన ఉపాధి కూలీల సంఖ్య 4.39 లక్షలు	రోజుకు సగటున అందించిన కూలీ రూ. 257
పనులు కల్పించిన వారిలో ఎస్సీలు 36.64 శాతం	పనులు కల్పించిన వారిలో ఎస్టీలు 9.14 శాతం
ఉపాధి పొందిన మహిళలు 66.94 లక్షలు మంది	మహిళలు పొందిన వేతనాలు 136.73 రూ. కోట్లు

అడిగిన ప్రతి ఒక్కరికీ పని



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేలా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకున్నాం. ఈ ఆర్థికక సంవత్సరంలో ఇప్పటికే లక్ష్యానికి మించి పనులు కల్పించాం. వైఎస్‌ఆర్‌ జలకళ కింద 4 వేల బోర్లు మంజూరు చేశాం. మొక్కల పెంపకంలో 87 కిలోమీటర్ల మేర మొక్కలు నాటాం.

– డి.రాంబాబు, పీడీ, డ్వామా

25 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం



వచ్చే మూడు నెలల్లో ఉపాధి హామీలో 25 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. దీని ద్వారా మరో రూ.60 కోట్లు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐదు రకాల భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్‌ఆర్‌ హెల్త్‌ క్లినిక్‌, డిజిటల్‌ లైబ్రరీ, పాలసేకరణ కేంద్రాల నిర్మాణాలకు నిధులు అందజేస్తున్నాం.

– వి.ప్రసన్న వెంకటేష్‌, కలెక్టర్‌, ఏలూరు జిల్లా

న్యూస్‌రీల్‌

చినవెంకన్న బంగారం.. బ్యాంకులో భద్రం



శ్రీవారి బంగారాన్ని బ్యాంకు అధికారులకు అందజేస్తున్న ఆలయ ఈవో త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారికి భక్తుల నుంచి హుండీలు, కానుకల ద్వారా లభించిన బంగారాన్ని దేవస్థానం అధికారులు గోల్డ్‌ బాండ్‌ స్కీమ్‌ కింద విజయవాడలోని భారతీయ స్టేట్‌ బ్యాంక్‌లో బుధవారం డిపాజిట్‌ చేశారు. ఆలయ స్ట్రాంగ్‌ రూమ్‌లో భద్రపరచిన బంగారాన్ని ముందుగా దేవదాయ శాఖ మల్టీజోన్‌–1 రాజమండ్రి ప్రాంతీయ సంయుక్త కమిషనర్‌ సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్‌ అధికారి దుర్గాభవాని, శ్రీవారి ఆలయ ద్వితీయ ప్రధానార్చకులు భాను, ఈఓ వేంద్ర త్రినాథరావుల సమక్షంలో బయటకు తీసి, తూకం వేశారు. అనంతరం 7.339 కేజీల బంగారాన్ని గోల్డ్‌ బాండ్‌ స్కీమ్‌ కింద ఎస్‌బీఐ (విజయవాడ) అధికారులకు అప్పగించారు. నిరుపయోగంగా ఉన్న 342 కేజీల వెండి వస్తువులను ఒక ట్రంకు పెట్టెలో పెట్టి సీలు వేశారు. ఈ వెండి వస్తువులను ఈనెల 18న హైదరాబాద్‌లోని మింట్‌లో కరిగించనున్నట్లు ఈఓ త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, కేఎల్‌ఎన్‌ రాజు, సూపరింటెండెంట్‌లు రమణ రాజు, వాసు తదితరులున్నారు.

నేడు జాబ్‌ మేళా

ఏలూరు (టూటౌన్‌): స్థానిక గ్జేవియర్‌ నగర్‌ జిల్లా ఉపాధి కార్యాలయం ఏలూరులో గురువారం నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్‌ ఫైనాన్స్‌ సంస్థలో మొత్తం 50 ఖాళీలకు ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిలపారు. జెఆర్‌ఈ/ఎస్‌ఆర్‌ఇ పోస్టులకు డిగ్రీ విద్యార్హత ఉండాలన్నారు. పిఓ పోస్టులకు ఎంబీఏ/ఎంకామ్‌ చదివిన వారు అర్హులుగా పేర్కొన్నారు. సివిల్‌ సూపర్‌వైజర్‌ పోస్టులకు ఇంజినీరింగ్‌ చదివిన వారు అర్హులుగా తెలిపారు. నెలకు జీతం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుందని చెప్పారు. అర్హత ఉండి ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌ మేళాకు హాజరు కావాలని కోరారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

ఏలూరు(మెట్రో): సచివాలయాల సిబ్బంది ముందస్తు అనుమతి పొందకుండా 7 రోజుల కంటే ఎక్కువ రోజులు గైర్హాజరైతే గుర్తించి వారి నివేదికను కలెక్టర్‌ కార్యాలయానికి అందజేయాలని జిల్లాలోని ఎంపీడీఓలను కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్‌ కలెక్టర్‌ అరుణ్‌ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్‌ ఇంజనీర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేస్తూ వారానికి ఒకరోజు ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లతో ఎంపిడిఓలు సమావేశం నిర్వహించి చర్చించిన అంశాల వివరాలను జెడ్పీ సీఈవోకు అందజేయాలన్నారు. హౌసింగ్‌ కాలనీల్లో తాగునీరు, విద్యుత్‌, రోడ్లపై చర్చించారు.ఫ్యామిలీ ఫిజిషియన్స్‌పై అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రవికుమార్‌, డీఆర్‌డీఏ పీడీ ఆర్‌.విజయరాజు, హౌసింగ్‌ పీడీ వేణుగోపాల్‌, పంచాయితీరాజ్‌ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కూడారై



పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారికి చందన అలంకరణ

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరిలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూడారై మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అక్కారి అడిశల్‌ ప్రసాదాన్ని 108 గంగాళాలతో స్వామికి నివేదనగా సమర్పించారు. ఈ సందర్భంగా కూడారై ఉత్సవ విశేషాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్‌ ఆచార్యులు వివరించారు. తొలుత ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో గంగాళాలతో ప్రసాదాన్ని నివేదన చేసి ప్రత్యేక మంగళ నీరాజనం సమర్పించారు. శ్రీనివాసుడిని చందనంతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పారిజాతగిరి ఆలయంలో కూడారై ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సత్వర న్యాయం కోసం సంస్కరణలు

ఆగిరిపల్లిలో పోలీసుస్టేషన్‌ ప్రారంభించిన హోం మంత్రి తానేటి వనిత



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ అప్పారావు తదితరులు

ఆగిరిపల్లి: ప్రజలకు సత్వర న్యాయం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌ శాఖలో సంస్కరణలు తీసుకొచ్చిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని ఆగిరిపల్లిలో ఆధునిక హంగులతో నిర్మించిన ఆగిరిపల్లి పోలీస్‌ స్టేషన్‌ను హోంమంత్రి వనిత, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ విధానం అమలు చేస్తున్నామన్నారు. పోలీస్‌ స్టేషన్‌కు వచ్చిన వారిని పలకరించి వారితో మాట్లాడటానికి రిసెప్షన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వెయిటింగ్‌ హాలు, మహిళా సిబ్బందికి ప్రత్యేక విశ్రాంతి గది, పోలీస్‌ స్టేషన్‌ భవనంపై సిబ్బందికి అదనపు విశ్రాంతి గదుల నిర్మాణం ఏర్పాటు చేశామన్నారు. ఆగిరిపల్లిలో ట్రాఫిక్‌ నియంత్రణకు సీసీ కెమెరాలతో మానిటరింగ్‌ వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌ అప్పారావు రూ.5 లక్షల నిధులు, దాతలు ఇచ్చిన రూ.45 లక్షలతో పోలీసు స్టేషన్‌ నిర్మించడం అభినందనీయమన్నారు.

దాతలకు ఘన సత్కారం : దిశ యాప్‌ను ప్రవేశపెట్టి మహిళలకు అన్ని వేళలా తోడుగా ఉంచారన్నారు. ఇంతవరకు 900 కేసులు దిశ యాప్‌ ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌ అప్పారావు మాట్లాడుతూ పోలీస్‌ స్టేషన్‌కు వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని ఆగిరిపల్లి పోలీస్‌ స్టేషన్‌ నిర్మాణం విషయాన్ని డీఎస్పీగా పనిచేసిన శ్రీనివాసులు తన దృష్టికి తీసుకు వచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే నిధులతో పాటు నెక్కలం గొల్లగూడెం కుశలవ సంస్థ రామకృష్ణ, వట్టిగుడిపాడు విమల ఫీడ్స్‌ మధుసూదనరావు, పోతవరప్పాడు ఎస్‌ఆర్‌ఐ ఇంజనీరింగు కళాశాల చైర్మన్‌ వెంకట్రావు, తాడేపల్లి చొప్పరమెట్ల కేకేఆర్‌ హ్యాపీ వ్యాలీ స్కూల్‌ అధినేత కొసరాజు కోటేశ్వరరావులు కలిపి రూ.10 లక్షల చొప్పున రూ.40 లక్షలు, విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త పొట్లూరి వెంకట కృష్ణారావు రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.50 లక్షలతో పోలీస్‌ స్టేషన్‌ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పోలీస్‌ స్టేషన్‌ నిర్మాణానికి నిధులు సమకూర్చిన దాతలను హోం మంత్రి, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్‌ ఐజీ పాలరాజు, ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌ శర్మ, నూజివీడు సబ్‌ కలెక్టర్‌ ఆదర్శ్‌ రాజేంద్రన్‌, నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌ గౌడ్‌, నూజివీడు సీఐ అంకబాబు, ఎస్‌ఐ చంటిబాబు, ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్‌ యూనియన్‌ రాష్ట్ర చైర్మన్‌ దేశిరెడ్డి రాఘవరెడ్డి, కృష్ణా జిల్లా పరిషత్‌ వైస్‌చైర్మన్‌ కృష్ణంరాజు, జెడ్పీటీసీ వీరబాబు, ఎంపీపీ అనూష తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష వితరణ

సాక్షి, భీమవరం: మావుళ్ళమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఎల్లప్పుడు ఉంటాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. పట్టణానికి చెందిన అక్కిరెడ్డి జయలక్ష్మి పేరున ఆమె మనుమరాలు ప్రియాంక మౌని మావుళ్లమ్మ నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 ఎమ్మెల్యే శ్రీనివాస్‌ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో మౌని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం



జగనన్న తోడు 6వ విడత కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌

ఏలూరు(మెట్రో): చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారి ఉపాధికి ఊతంగా జగనన్న తోడు నిలుస్తుందని కలెక్టర్‌ వి.ప్రసన్న వెంకటేష్‌ అన్నారు. బుధవారం జగనన్న తోడు పథకం 6వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి వడ్డీ రాయితీని అందజేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్‌. జగన్‌మోహన్‌ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. జిల్లా కలెక్టరేట్‌ వీడియో కాన్ఫరెన్స్‌ హాలు నుంచి కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌, డీఆర్‌డీఏ పీడీ ఆర్‌.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానుయేల్‌, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ చిరువ్యాపారులు సంప్రదాయ వృత్తుల వారికి జగనన్నతోడు ఆపన్న హస్తంగా నిలుస్తుందన్నారు. జగనన్న తోడు పథకం 6వ విడతలో ఏలూరు జిల్లాలో 6,733 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున రూ. 6.73 కోట్లు జమచేశామన్నారు. జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 29,300 మంది లబ్ధిదారులకు రూ. 73 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ కింద జమచేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారం చేసుకునే వారికి ఈ పథకం కింద అండగా నిలుస్తుందని తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే తిరిగి వడ్డీలేని రుణాలు పొందవచ్చన్నారు.

గ్రామీణ ప్రాంత మహిళలకు చేయూత

జిల్లాలో ఈ విడతలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే 3,856 మందికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు మంజూరయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలో 2,877 మందికి ఈ పథకం ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా ఒక్కో లబ్ధిదారునికి రూ.10 వేల చొప్పున రుణాలు అందిస్తుందన్నారు. అనంతరం చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలకు సంబంధించి 6,733 మంది లబ్ధిదారులకు రూ. 6.73 కోట్లు, వడ్డీ రీయింబర్స్‌ మెంట్‌ కింద 29,300 మంది లబ్ధిదారులకు రూ.73 లక్షలు ఆన్‌లైన్‌ ద్వారా జమచేయగా, సంబంధిత నమూనా చెక్కులను కలెక్టర్‌ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన తినుబండారాలు కలెక్టర్‌ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



వనపర్తి దేవి (ఫైల్)

జంగారెడ్డిగూడెం: భార్యాభర్తల మధ్య తగాదాల నేపథ్యంలో మనస్తాపంతో భార్య ఈగలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం ఎ.పోలవరం గ్రామానికి చెందిన వనపర్తి సతీష్‌తో అదే గ్రామానికి చెందిన దేవి (20)కి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడు నెలల పాప ఉంది. బుధవారం ఉదయం సతీష్ కూలిపనికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సతీష్ పనికి వెళ్లిపోయాడు. గొడవ నేపథ్యంలో మనస్తాపం చెందిన దేవి ఈగలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దేవి అత్త నిర్మల గమనించి, కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే ఈ ఘటనపై దేవి సోదరి ఎ.పోలవరానికి చెందిన తమ్మిశెట్టి నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన చెల్లెలు దేవి, బావమరిది సతీష్‌ది ప్రేమ వివాహమని, అయితే సతీష్‌కు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉంటంతో వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఇటీవల ఫోన్ విషయమై గొడవ జరిగి తన చెల్లెలిని కొట్టాడని, దీంతో మనస్తాపం చెంది ఈగల మందు తాగిందని ఫిర్యాదులో పేర్కొంది. సతీష్ బలవంతంగా తన చెల్లితో మందు తాగించాడనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పథకాలపై హిజ్రాలకు అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి



హిజ్రాలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై హిజ్రాలు అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో హిజ్రాలకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకాలు, హక్కులను సాధించడానికి హిజ్రాలు ముందుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా హిజ్రాలకు అవసరమైన న్యాయ సలహాలను ఉచితంగా అందిస్తామన్నారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ సమాజంలో పుట్టిన ప్రతి వ్యక్తి రాజ్యాంగానికి లోబడి జీవించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి హిజ్రా ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఇంటి స్థల సమస్యలు, రేషన్, ఆధార్ కార్డు సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఏలూరు డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు మాట్లాడుతూ గతంతో పోలిస్తే హిజ్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు శాఖాపరంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాయన్నారు. హిజ్రాలు చట్టానికి లోబడి వారి జీవితాన్ని కొనసాగించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ నీలకంఠ ప్రధానో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎన్ మునేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, హిజ్రా ప్రతినిధి చంద్రిక, డీఆర్‌డీఏ ఏపీఓ ఎన్వీ సూర్యకుమారి, ఐసీడీఎస్ పీడీ కేపీఎల్ పద్మావతి, ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీషా, హౌసింగ్ ఏఈ ఎండీ గౌస్ పాషా పాల్గొన్నారు.

సంక్రాంతి క్రీడోత్సవాలు ప్రారంభం



ఏలూరులో క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు

ఏలూరు టౌన్: సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ కుటుంబాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని, యువత చెడు వ్యసనాలవైపు మళ్లవద్దని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు కోరారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలపై ఏలూరు వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి క్రీడోత్సవాలను డీఎస్పీ పైడేశ్వరరావు, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకుని, అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ కొద్దిసేపు బ్యాటింగ్ చేస్తూ యువతలో ఉత్సాహాన్ని నింపారు. యువత అసాంఘిక కార్యకలాపాలవైపు ఆకర్షితులు కాకుండా సంప్రదాయబద్ధమైన క్రీడలను ఆడుకునేలా ప్రోత్సహించాలన్నారు. జూదం, కోడిపందేలు, పేకాట గుండాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకూడదని కోరారు. ఇష్టారాజ్యంగా ఎవరైనా కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ రామకృష్ణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గడపగడపకూ సంక్షేమం



పెదపాడు : అప్పనవీడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



మండవల్లి : పెరికెగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

ఏలూరు (టూటౌన్)/చింతలపూడి : భార్యను అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి పి.మంగాకుమారి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చింతలపూడి మండలం ఊట సముద్రం గ్రామానికి చెందిన రంగు లక్ష్మణరావు తన భార్య జగదీశ్వరి ప్రవర్తనపై అనుమానంతో 2016 అక్టోబర్ 10న ఆమెను గొడ్డలితో నరకడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. దీనిపై స్థానిక వీఆర్వో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేసి సదరు విషయంపై చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.నాగేంద్ర ప్రసాద్, సీఐ జి.దాసు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. దీనిపై అప్పట్లో జి.శ్రీనివాస్ యాదవ్ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో పీపీ లక్ష్మణ్ నాయక్ తన వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడి నేరం రుజువు కావడంతో జడ్జి మంగాకుమారి బుధవారం తుది తీర్పును వెలువరించారు. ఈ కేసు విచారణకు సహకరించిన చింతలపూడి సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై డి.హరికృష్ణ, కోర్టు కానిస్టేబుల్ జి.అశోక్, జిల్లా కోర్టు లైజిన్ ఆఫీసర్ ఏఎస్సై సిసిలీ లను జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్‌శర్మ అభినందించారు.

1967' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జేసీ పి.అరుణ్‌బాబు



ఏలూరు (మెట్రో) : ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి వినియోగదారులు, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారానికి 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నాణ్యమైన వస్తువుల పంపిణీ, ధాన్యం కొనుగోలులో రైతులు కనీస మద్దతు ధర పొందుతున్నారా, తూనికలు కొలతలు సమస్యలు, గ్యాస్ సరఫరా పెట్రోల బంకుల్లో, బియ్యం కార్డు సమస్యలతో పాటుగా అన్ని రకాల సమస్యలను వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967ను 10 మంది సిబ్బందితో నెలకొల్పినట్లు ఆయన చెప్పారు. వినియోగదారులకు హక్కులను కల్పిస్తూ వారిలో చైతన్యం కోసం జూలై , 2020 నుంచి అమలులోకి తీసుకువచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం, 2019ను అనుసరించి జిల్లాలో వినియోగదారుల సౌకర్యం కొరకు ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967 రాష్ట్ర స్థాయిలో అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. సదరు టోల్ ఫ్రీ నంబర్ 1967కు ప్రజలు వారి సమస్యలు తెలియజేస్తూ ఫిర్యాదు చేస్తే సిబ్బంది నమోదు చేసి, ఫిర్యాదుదారుడికి నమోదు సంఖ్యను తెలియజేస్తారన్నారు. ఈ సమస్యను సంబంధిత శాఖకు పరిష్కారం నిమిత్తం బదిలీ చేస్తారన్నారు. ప్రజలు సదరు ఫిర్యాదు ఏ స్థితిలో ఉన్నదీ ఫిర్యాదు నమోదు సంఖ్య ద్వారా ఆన్‌లైన్లో తెలుసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967 ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయపు పనిదినాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ఏలూరు జిల్లాలో గల వినియోగదారులందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు కోరారు.

'డీజీగా పదోన్నతితో బాధ్యత పెరిగింది'



చింతలపూడి ఎయిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీ పీవీ సునీల్ కుమార్

చింతలపూడి: డీజీగా పదోన్నతితో తన బాధ్యతను మరింత పెంచిందని ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం చింతలపూడి విచ్చేసిన సునీల్ కుమార్‌కు అంబేడ్కర్ మిషన్ (ఎయిమ్) ఆధ్వర్యంలో స్వాగతం పలకగా, పాత బస్టాండ్ సెంటర్ వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సునీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎయిమ్ నేతృత్వంలో ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీ హోదాలో చింతలపూడి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభ కలిగిన యువతకు ఎయిమ్ అపన్నహస్తం అందిస్తుందన్నారు. పేద విద్యార్థులు, యువతకు చేయూత ఇవ్వడం ఎయిమ్ స్థాపన ఉద్దేశమన్నారు. కష్టపడి చదివి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. రూ.10 లక్షల వ్యయంతో చింతలపూడి, అమలాపురంలో ఉచిత కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్ జిల్లా నాయకులు కాకర్ల సత్యన్నారాయణ, ఎయిమ్ రాష్ట్ర నాయకులు మాదిరి రాంబాబు, రిటైర్డ్ అడిషినల్ డీజీ పూరేటి విజయానంద్, రోహిత్ శౌర్య, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, లేబర్ బోర్డ్ వైస్ చైర్మన్ దయ్యాల నవీన్‌బాబు, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, నగర పంచాయితీ కమిషనర్ ఎన్.రాంబాబు, ఎన్ఎస్ రాజేంద్ర, కంచర్ల బుచ్చిబాబు పాల్గొన్నారు.

మేత బస్తాల చోరీ

భీమవరం అర్బన్: తన చేపల చెరువు వద్ద మేత బస్తాలు దొంగిలించారంటూ బుధవారం ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగిడిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని సోంబాబుకు చెందిన చెరువు వద్ద నిల్వ చేసిన 48 మేత బస్తాలను గత నెల 27న దొంగిలించారని, వాటి విలువ రూ.70 వేలు ఉంటుందని సోంబాబు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కొండలరావు కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ. 1,00,116 లను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన పెండ్యాల కొండలరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు విరాళం బాండ్‌పత్రాన్ని అందించి, శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

గోనెపాడులో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కైకలూరు: చేపల చెరువుల్లో మేత కోసం ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై చల్లా కృష్ణ బుధవారం చెప్పారు. ఆకివీడు మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన వెలగెట్ల జనార్దన్ కైకలూరు సమీప ప్రాంతాల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తరలిస్తుండగా కైకలూరు మండలం గోనెపాడు వద్ద అడ్డుకున్నామన్నారు. అద్దెకు తీసుకున్న ఆటోలో వీటిని తరలిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. కైకలూరు సీఎస్ డీటీకి బియ్యం అప్పగించి జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్